

వలసదారులూ వెళ్లిపోండి...!

మలేషియా ప్రభుత్వం వలస కార్మికులను తిరిగి వెళ్లి పోవాలని ఆంక్షలు విధించిది. దీంతో విజిట్ వీసాపై వెళ్లిన ఉమ్మడి జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు. 8లో▸



నేడు ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్

బాసర ట్రిపుల్ఐటీలో ప్రవేశాలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈమేరకు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.3 /26.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. అల్పపీడనం ప్రభావంతో చాలా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎస్‌ను కలిసిన మాజీ మంత్రి



సీఎస్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్ టౌన్: తెలంగాణ ప్రభుత్వ నూతన చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారావును మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఫలాలు అట్టడుగు ప్రజలకు చేరేలా ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ.. ఉత్తమమైన పరిపాలనకు దోహదపడాలని ఆకాంక్షించారు.

మత్స్యశాఖ ఏడీపై చర్య తీసుకోవాలి



నిరసనలో మత్స్యకారులు...

దస్తురాబాద్: మత్స్యశాఖ ఏడీ రాజనర్సయ్యపై చర్య తీసుకోవాలని మండలంలోని భూత్కూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంపూర్ గ్రామ మత్స్యకారులు గోదావరి తీరంలో మంగళవారం నిరసన తెలిపారు. 2016లో హైకోర్టు తీర్పు ప్రకారం రాంపూర్ మత్స్య సహకార సంఘం ఏర్పాటుకు అనుమతి ఇచ్చారని, ఆ తీర్పు ప్రకారం జిల్లా మత్స్యశాఖ అధికారులు సంఘం ఏర్పాటు చేసి గోదావరి తీరంలో చేపల వేట సాగించాలని లైసెన్స్‌లు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకుంటున్నామని, ఈసారి మాత్రం రెన్యూవల్ చేయడం లేదని ఆగ్రహం వ్యక్త చేశారు. లైసెన్స్‌లు ఇవ్వకుంటే ఇతర గ్రామాల వారు కూడా వచ్చే అవకాశం ఉందని, దీంతో గొడవలు జరుగుతాయని పేర్కొన్నారు. మత్స్యకారుల మధ్య గొడవ సృష్టించేలా వ్యవహరిస్తున్న ఏడీపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాంపూర్ మత్స్యకారులకు లైసెన్స్‌లు జారీ చేయాలని కోరారు.

బెస్ట్ ప్రాక్టీసెస్ ఉపాధ్యాయుల ఎంపిక



ఎంపిక చేసిన ఉపాధ్యాయులతో అధికారులు

నిర్మల్ రూరల్: జిల్లాలోని బెస్ట్ ప్రాక్టీసెస్ ఉపాధ్యాయుల ఎంపికను కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్, వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, ఎస్సీఈఆర్టీ ప్రొఫెసర్ సురేశ్‌బాబు ఉపాధ్యాయుల ప్రదర్శనలు పరిశీలించారు. 88 మంది ఉపాధ్యాయులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఎం.ఎల్లన్న (ఎంపీపీ ఎస్ వానల్పాడు, బైంసా), జాడి శ్రీనివాస్(జెడ్పీహెచ్ఎస్ మస్కాపూర్), ప్రవీణ్‌కుమార్(ఎంపీపీఎస్ సేవాలాల్ తండా, లోకేశ్వరం)ను ఎంపిక చేసి వీరిపేర్లు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపినట్లు అధికారులు తెలిపారు.

పార్ట్ టైం ఉద్యోగాలకు దరఖాస్తులు

సోన్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అధ్యాపకులుగా పార్ట్ టైం ప్రాతిపదికన పనిచేయడానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 30 వరకు లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక సంక్షేమ గురుకులంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. బాలికల పాఠశాల, కళాశాలకు మహిళలు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులను మెరిట్, డెమో ప్రాతిపదికన ఎంపిక చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 94928 38255 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయుడికి ప్రశంస

ఖానాపూర్: హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ గణిత ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ ఉత్తమ అభ్యాసన తీరును ప్రశంసించారు. వృత్త్యంతర శిక్షణలో జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సదస్సులో ఎంఈవోల విద్యాసంచాలకులు నర్సింహారెడ్డి, ఎస్ఈఆర్ డైరెక్టర్ రమేశ్, వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి ఉపాధ్యాయుడిని ప్రత్యేకంగా అభినందించారు.

వానమ్మా.. జర ఆగమ్మా..!

- వారం రోజులుగా జిల్లాను వీడని వరుణుడు
- కల్లాల్లో తడుస్తున్న ధాన్యం..
- కొద్ది రోజులు ఆగాలని రైతుల వేడుకోలు
- తేమశాతం పెరగడంతో కోతలు



లక్ష్మణచాంద మండలం రాచపూర్ కొనుగోలు కేంద్రంలో నిలిచిన నీరు..

ధాన్యం కొనుగోలు వివరాలు..

ధాన్యం కొనుగోలు అంచనా	1,62,000 మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాలు	318
కొనుగోలు చేసిన ధాన్యం	1,33,000 మెట్రిక్ టన్నులు
ఇంకా రావాల్సిన ధాన్యం	40 వేల మెట్రిక్ టన్నులు

నిర్మల్: 'ఒక్కో యేడు ఎంత వేడుకున్నా జాడ కూడా ఉండవు. ఈయేడాదేమో.. జరంత ఆగుమంటే కూడా ఆగుతలేవు. గీ వడ్లు పోయేదాకన్నా ఓపిక పట్టమ్మా.. నీకు పుణ్యముంటది. చేసిన కష్టం చేతికందే వేళ.. నీళ్లపాలైతుంటే కన్నీళ్లు అగుతలేవు తల్లీ. ఇప్పటికే తాలుతప్ప అంటూ కోతలు పెట్టే మిల్లర్లు తడిసిన వడ్లంటే సగం పైసలే ఇస్తమంటరు. నిన్నే నమ్ముకుని బతికేటోళ్లం. అందరికీ అన్నం పెట్టేటోళ్లం. మమ్మల్ని పగబట్టినట్లు చేయకు..ఓ వానమ్మా.. జర ఆగిరావమ్మా..' అంటూ కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో తడుస్తున్న ధాన్యాన్ని తడికళ్లతో చూస్తూ వేడుకుంటున్నారు బాధిత రైతులు. జిల్లాల్లో ఇప్పటికే 80 శాతం వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తయినా.. మిగిలిన వడ్లను వాన ముంచేస్తోంది. తడిసిన, మొలకల వచ్చిన వడ్లంటూ మిల్లుల్లో బస్తాకు 4 కిలోల చొప్పున కోతలు పెడుతున్నారు.

అకాలంలో వచ్చిన అల్పపీడనం రైతన్నపైనే తీవ్ర ప్రభావం చూపుతోంది. అకాలం ముప్పు తొలగకముందే.. రుతుపవనాలు రావడంతో పది రోజులుగా జిల్లాను వర్షాలు వీడడం లేదు. మబ్బులు కమ్ముకుని, ముసురు పెట్టినట్లు వాన కురుస్తూనే ఉంది. కొన్నిమండలాల్లో ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టుకున్న, సంచుల్లో నింపిన ధాన్యం తడుస్తోంది. వివిధ కారణాలతో పలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయి. ఇప్పటికే తడిసిన ధాన్యానికి మొలకలూ వస్తున్నాయి. ఇక జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖతోపాటు జిల్లా అధికారులూ హెచ్చరిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



ముఠాపూర్ గ్రామ సమీపంలో రోడ్డుపై మొలకెత్తిన ధాన్యం చూపుతున్న రైతు

కోతలు తప్పవు..

ప్రభుత్వం గ్రేడ్–ఏ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,300 చొప్పున మద్దతు ధర చెల్లిస్తోంది. ఈ ధర దక్కాలంటే ధాన్యంలో తేమ 17శాతం మించకూడదు. కానీ.. అకాలవర్షంతో ఆగమైన వాతావరణం రైతన్నను పరేషాన్ చేస్తోంది. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితుల్లో తేమశాతం అటుంచి, ధాన్యం తడవకుండా చూసుకోవడం రైతులకు పెద్ద పరీక్షగా మారింది. టార్పాలిన్లను కప్పుతూ.. తీస్తూ.. ధాన్యాన్ని కాపాడుకుంటున్నారు. ఇక తడిసిన ధాన్యాన్నీ సర్కారు ఆదేశాల మేరకు కొనుగోలు చేస్తున్నా.. రైసుమిల్లర్లు సంచికి 3–4 కిలోల కోత తప్పదంటున్నారు.

ఆందోళనలో రైతన్న..

'ఇదేం కాలమో.. ఏమో..! ముందస్తుగా వచ్చి మమ్మల్ని ఇబ్బంది పెడుతోంది..' అంటూ చాలామంది రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఆలస్యంగా సాగు చేసి, హార్వెస్టర్లు సమయానికి అందుబాటులో లేక వరి కోతలు చేయనివాళ్లు, కోతలు కోసి ఆరబెట్టుకున్నవాళ్లు, సంచుల్లో నింపి కొనుగోలు కేంద్రాల్లో వేచి చూస్తున్న రైతులందరూ ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్నీ కొంటామంటూ ప్రభుత్వం, జిల్లా అధికారులు భరోసా ఇస్తున్నా.. సదరు ధాన్యానికి రైసుమిల్లర్లు పెడుతున్న కొర్రీలు రైతులకు ఇబ్బంది పెడుతున్నాయి.

ఏం చేయాలో తెలుస్తలేదు..



నాకున్న ఎకరంన్నరతోపాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని వరి వేసుకున్న. అకాలవర్షం కారణంగా ఇంత వరకు కోత కోయలేదు. ఇప్పుడింకా వానలు పడుతాయంటున్నారు. ఏం చేయాలో తెలుస్తలేదు.

– వాసాల పోశెట్టి, జామ్, మం.సారంగపూర్

తడిసిన ధాన్యం కొనుగోలు..



తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు లారీలలో లోడ్ చేయించి, రైసుమిల్లులకు తరలిస్తున్నాం. సాధ్యమైనంత వరకు రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేలా ప్రయత్నిస్తున్నాం.

–కిశోర్‌కుమార్, అడిషనల్ కలెక్టర్

జొన్న రైతులకు నష్టం..



హిప్నెల్లిలో మొలకలు వచ్చిన జొన్న కంకులు

తానూరు: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. హిప్నెల్లి, బెంబర, తానూరు తోపాటుఆయా గ్రామాల్లో కొతకు వచ్చిన జొన్నపంట నెలావాలింది. కంకులకు మొలకలు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరదలో ధాన్యం..



లింబా(కె)లో వర్షపునీరు తొలగిస్తున్న రైతు

కుంటాల: మండలంలో మంగళవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. లింబా(కె), కుంటాల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి పోయింది. కుప్పల నుంచి వరద నీరు తొలగించేందుకు రైతులు తిప్పలు పడ్డారు. కారు మబ్బులు కమ్ముకోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించారు.

పొంగిన వాగులు..



ఉడుంపూర్ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

కడెం: మండలంలోని ఉడుంపూర్, మిద్దెచింత, గండిగోపాల్‌పూర్, ఇస్లాంపూర్, తదితర గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

కొనుగోళ్లలో జాప్యంపై ఆందోళన

సారంగపూర్: ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై మండలంలోని ధని గ్రామానికి చెందిన రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. నిర్మల్–స్వర్ణ రహదారిపై బైఠాయించారు. రోడ్డుపై మొలకెత్తిన ధాన్యం పోసి గంటన్నరపాటు ఆందోళన చేశారు. వర్షాల కారణంగా పంట కోయకుండా పొలాల్లోనే ఉండిపోయి నష్టపోతున్నామని తెలిపారు. ఇక, మార్కెట్‌కు తరలించిన ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో నష్టపోతున్నామని పేర్కొన్నారు. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కయి రైతులను దోచుకునేందుకు ప్రణాళిక రూపొందించారని ఆరోపించారు. క్వింటాల్‌కు 6 కిలోల ధాన్యం అదనంగా తూకం వేస్తున్నారని తెలిపారు. నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ రైతులను సముదాయించేందుకు ప్రయత్నించినా వినిపించుకోలేదు. సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడతామని ఫోన్‌ద్వారా అధికారులను సీఐ సంప్రదించి ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రైతుల ఆందోళనతో ఈరహదారిపై రాకపోకలు స్తంభించాయి. పోలీసులు బోరిగాం మీదుగా వాహనాలను మళ్లించారు.



ఆందోళన చేస్తున్న ధని గ్రామ రైతులు

పేదల సొంతింటి కల సాకారం

- మంత్రి సీతక్క
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ముధోల్/లోకేశ్వరం: పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. లోకేశ్వరం, ముధోల్ మండలాల్లో మంగళవారం పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముధోల్ మండలం బ్రాహ్మణ్‌గావ్‌లో గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవం, అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే రామరావుపటేల్, కలెక్టర్ అభిలాష అభినవ్‌లతో కలిసి రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యగా స్టీల్ బ్యాంకును ఆవిష్కరించారు. దౌనెల్లి నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు, తానూర్ బీటీ రోడ్డు సహా రూ.20 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. రూ.1.90 కోట్లతో కుంటాల–దౌనెల్లి రోడ్డు, రూ.5.9 కోట్లతో తానూర్–హుండా రోడ్డు రినివల్, రూ.10 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

లోకేశ్వరంలో కుమురంభీం విగ్రహావిష్కరణ

లోకేశ్వరం మండల కేంద్రంలో కుమురంభీం విగ్రహాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మీ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీలు తమ సంస్కృతి, భాష, ఆచారాలను కాపాడుకోవాలన్నారు. హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అర్లి నుంచి ముధోల్ వరకు రోడ్డు నిర్మాణం, ముధోల్‌లో డిగ్రీ ఆశ్రమ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీల కుల ధ్రువీకరణ పత్రాల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో ఎస్పీ జానకీషర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఎమ్మెల్యేలు రామారావుపటేల్, వెడ్మ బొజ్జుపటేల్, భైంసా వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డి, ఆదివాసీ నాయకపోడ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సట్ల అశోక్, ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి జగదీష్, పీఏసీఎస్ చైర్మన్ రత్నకర్‌రావు, నాయకులు సుదర్శన్‌రెడ్డి, బోడికె సాయన్న, రాజేశ్‌బాబు, శ్రీధర్, చిన్నారావు, విగ్రహదాత జయసాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్, ఎస్పీ

పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- డీఈవో రామారావు

నిర్మల్ రూరల్: పాఠశాలల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని డీఈవో రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో మంగళవారం ప్రారంభమైన చివరి విడత ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు తమ బడులను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థుల నమోదు, విద్యా ప్రగతి, విద్యా కార్యక్రమాల నిర్వహణ, విద్యార్థుల్లో సంపూర్ణ అభివృద్ధి, పాఠశాలల్లో నూతన కార్యక్రమాల అమలు, విద్యార్థులను పోటీ పరీక్షల్లో పాల్గొనేలా చేయడం, విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా చూసుకోవడం తదితర అంశాలపై దృష్టి పెట్టాలని వివరించారు. విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు గుర్తిస్తూ అభినందనలు తెలపాలన్నారు. అనంతరం బాలశక్తి శిక్షణ కార్యక్రమం జిల్లా ఇన్‌చార్జి దేవిప్రియ మాట్లాడుతూ బాలశక్తి కార్యక్రమం 4 ప్రధాన ఉద్దేశాలను వివరించారు. జూన్ 15 నుంచి జిల్లాలోని 118 ఉన్నత పాఠశాలల్లో ప్రారంభిస్తున్నామన్నారు. ఇందులో ఏఎంవో నరసయ్య, సీఎంవో ప్రవీణ్ కుమార్, రిసోర్స్ ఉపాధ్యాయులు తోడిశెట్టి పరమేశ్వర్, మైసాజి, రాజశేఖర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో రామారావు

జొన్న రైతుల తిప్పలు



రోడ్డుపై బారులుతీరిన జొన్నల వాహనాలు

కుభీర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నెల రోజులుగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నలు కొనుగోలు చేస్తున్నారు. మంగళవారం జొన్నలు తెచ్చిన రైతులు వర్షంలో ఇబ్బంది పడ్డారు. మార్కెట్ యార్డు నుంచి తెలంగాణతల్లి చౌక్ వరకు రోడ్డువెంట వాహనాలు బారులుతీరాయి. బుధవారం నుంచి కొనుగోళ్లు నిలిపివేస్తామని అధికారులు చెప్పడంతో మంగళవారం భారీగా రైతులు జొన్నలు తీసుకువచ్చారు. యార్డులో ఇప్పటి వరకు సుమారు 28 వేల క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేశారు. మంగళవారం లారీలు రాక బస్తాలతో అక్కడే ఉండడంతో జొన్నలతో వచ్చిన వాహనాలు రోడ్డుపై బారులు తీరాయి. వర్షం కారణంగా టార్పాలిన్‌లు కప్పి ఉంచారు. జొన్నల కొనుగోళ్లు జూన్ 30 వరకు చేస్తామని గతంలో చెప్పారు. జూన్ 17 వరకు టోకెన్లు జారీచేశారు. తీరా ఇప్పుడు కొనుగోలు కేంద్రం ఎత్తేస్తామని ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులపై మరో భారం

- రెట్టింపైన జీలుగ విత్తనాల ధర
- వానాకాలం సీజన్‌కు ముందే పెంచిన ప్రభుత్వం
- 30 కేజీల జీలుగ ధర రూ.2,137

లక్ష్మణచాంద/మామడ: సాగు భూములను సారవంతం చేయడానికి ఖరీదైన రసాయన ఎరువులు, బయటి నుంచి మట్టి తరలించడం కన్నా, జీలుగ వంటి పచ్చిరొట్ట పంటలు రైతులకు పెట్టుబడి భారం తగ్గిస్తాయి. ఈమేరకు వ్యవసాయాధికారులు కూడా పచ్చిరొట్ట సాగును ప్రోత్సహిస్తారు. జీలుగ సాగు నేల స్వభావాన్ని మెరుగుపరిచి, పంటల దిగుబడిని పెంచుతుంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం జీలుగ విత్తనాల ధరలను రెండింతలు పెంచింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూసారం పెంచేందుకు..

జీలుగను పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేసి, 45 రోజుల తర్వాత కలియదున్నడం ద్వారా నేల సారవంతం అవుతుంది. ఇది నీటి సామర్థ్యాన్ని పెంచి, 2% నత్రజని, సూపర్ పాస్ఫేట్, జింక్, కాల్షియం, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలను పంటలకు అందిస్తుంది. ఎకరానికి 10–12 కిలోల జీలుగ విత్తనాలను తొలకరి వర్షాల తర్వాత విత్తి, పూత దశలో దుక్కి దున్నడం ద్వారా 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు తయారవుతుంది. ఒక టన్ను ఎరువులో 6 కిలోల నత్రజని, 2 కిలోల భాస్వరం, 3 కిలోల పొటాష్ లభిస్తాయి. ఇది రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, రైతుల పెట్టుబడి ఖర్చును తగ్గిస్తుంది.

జీలుగ ధరల పెంపు..

రైతు భరోసా సబ్సిడీపై స్పష్టత లేని నేపథ్యంలో, రైతులు పెట్టుబడికి అప్పులు తెచ్చుకుంటున్నారు. ఈ సమయంలో జీలుగ విత్తనాల ధరలను ప్రభుత్వం రెట్టింపు చేసింది. గతేడాది 30 కిలోల జీలుగ బస్తా రూ.1,116 ఉండగా, ఈ ఏడాది రూ.2,137కి పెంచారు. ఈ ధరల పెంపు సాగు ఖర్చులను పెంచి, రైతులను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టింది.



లక్ష్మణచాంద మండలంలో సాగైన జీలుగ (ఫైల్)

పంపిణీ ఆలస్యం..

మరోవైపు జిల్లాకు జీలుగ విత్తనాలు ఇంకా పంపిణీ కాకపోవడం రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పచ్చిరొట్ట విత్తుకునేందుకు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగుకు 3,500 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను కేటాయించారు. ఇవి 50% సబ్సిడీపై త్వరలో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఇది 35 వేల ఎకరాలకు సరిపోతుంది. పెంచిన ధర తగ్గించడంతోపాటు త్వరగా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ధర తగ్గించాలి



రైతు సంక్షేమ ప్రభుత్వం అంటున్న కాంగ్రెస్ నేతలు వెంటనే పెంచిన జీలుగ ధరను తగ్గించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. ఇప్పటికే రైతుభరోసా రావడం లేదు. ఈ క్రమంలో పెంచిన ధరలు తగ్గించాలి – నర్సారెడ్డి, రైతు, లక్ష్మణచాంద

సకాలంలో అందించాలి



జీలుగలు రైతులకు సకాలంలో అందిస్తే ప్రయోజనం ఉంటుంది. వరిపంటను సాగు చేసే భూమిలో జీలుగ విత్తనాలు జూన్‌లో వేసుకుంటే వరినాట్లు వేసే సమయానికి ఎరువుగా మార్చుకోవచ్చు. జీలుగతోపాటు జనుము, పెసర విత్తనాలు అందించాలి. – భీంరెడ్డి, రైతు, కొరిటికల్

పచ్చిరొట్టతో భూసారం..



వరి సాగు చేసే రైతుల కోసం జిల్లాకు 3,500 క్వింటాళ్ల జీలుగలు కేటాయించారు. పచ్చిరొట్టను వరిసాగులో ఎరువుగా వాడే రైతులు యూరియా వినియోగంను తగ్గించాలి. జీ లుగను సాగు చేయడం ద్వారా పంటకు కావాల్సిన సూ క్ష్మపోషకాలు అందుతాయి. భూసారం పెరుగుతుంది.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

ఇంటర్ పరీక్షలకు 92 మంది గైర్హాజరు

నిర్మల్ రూరల్: జిల్లాలో జరుగుతున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మంగళవారం 92 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో పరుశురాం తెలిపారు. ఫస్ట్ ఇయర్‌లో 1,361 మంది విద్యార్థులకు 1,291 మంది హాజరవగా, 70 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 1,270 మంది విద్యార్థులకు 1,204 మంది హాజరవగా, 66 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 91 మంది విద్యార్థులకు 87 మంది హాజరవగా, నలుగురు గైర్హాజరయ్యారు. సెకండియర్‌లో మొత్తం 389 మందికి 367 మంది హాజరవగా, 22 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 361 మందికి 339 మంది హాజరవగా, 22 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 28 మందికి అందరూ హాజరైనట్లు తెలిపారు.

క్లుప్తంగా

గంజాయి మొక్కలు స్వాధీనం

సిరికొండ: మండలంలోని లక్ష్మీపూర్ శివారులో ఓ రైతు తన చేనులో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ముందస్తు సమాచారం మేరకు మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీసాయి తెలిపారు. మొక్కల విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందన్నారు. గంజాయి మొక్కలు సాగు చేస్తున్న బోరింగ్ గూడ గ్రామానికి చెందిన రైతుపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఈనెల 4న పంజాబ్‌చౌక్‌లో ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బేల మండలంలోని సాంగిడి గ్రామానికి చెందిన సద్దే నితీష్ వారితో వాగ్వివాదానికి దిగాడు. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

పెర్సపేన్ ఆలయంపై పిడుగు



ధ్వంసమైన ఆలయ గోపురం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి పొల్లుగూడలో జుగ్నాక్ వంశీయుల కుల దైవమైన (పెర్సపేన్) ఆలయంపై పిడుగు పడింది. దీంతో ఆలయ గోపురం ధ్వంసం కావడమే కాకుండా కలశం ఊడిపోయిందని గ్రామస్తులు తెలిపారు.

వలసదారులూ వెళ్లిపోండి...!

- దేశం విడిచి వెళ్లాలని మలేషియా ప్రభుత్వం ఆంక్షలు
- నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్న వారికి క్షమాభిక్ష పథకం అమలు
- ఉమ్మడి జిల్లాలోని వలస కార్మికుల్లో ఆందోళన




మలేషియాలో భారతీయ వలస కార్మికులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: బతుకుదెరువుకోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వందలాది మంది కార్మికులు విజిట్ వీసాపై మలేషియా వెళ్లారు. కానీ అక్కడి ప్రభుత్వం వలస కార్మికులను తిరిగి వెళ్లి పోవాలని ఆంక్షలు విధించడంతో ఆందోళన చెందుతున్నారు. వీసా నిబంధనలకు విరుద్ధంగా విజిట్ వీసాపై వచ్చి అక్రమ వలసదారులుగా ఉంటున్న వారిని తక్షణమే స్వదేశాలకు వెళ్లిపోవాలంటూ అక్కడి ప్రభుత్వం తాజాగా 'క్షమాభిక్ష' (ఆమ్నెస్టీ) పథకం అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం మలేషియా దేశంలో పాస్‌పోర్ట్ లేకుండా ఉన్నవారితో పాటు తాత్కాలిక వర్క్ వీసాలు, విజిట్ పర్మిట్ వంటివి గడువు ముగిసినా అక్కడే తలదాచుకుంటున్న వలస కార్మికులు వెళ్లిపోవాలని ఆదేశాలు ఇచ్చింది. క్షమాభిక్ష పథకం ద్వారా తమ స్వదేశాలకు వెళ్లేవారు ఎటువంటి జైలు శిక్ష లేకుండానే 500 రింగిట్లు, మనదేశ కరెన్సీలో రూ.10వేలు జరిమానా చెల్లించి తిరిగి స్వదేశానికి రావాల్సి ఉంటుంది. పాస్‌పోర్టు ఉన్నప్పటికీ, వీసా గడువు ముగిసిన వారితో పాటు, వీసాలు లేని వారందరినీ ఎమర్జెన్సీ ట్రావెల్ సర్టిఫికెట్ ఆధారంగా పక్షం రోజుల్లో రిటర్న్ జర్నీకి అవకాశం కల్పించింది. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్న వలసదారులందరూ మలేషియాలోని లాబువాన్ ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంటు డివిజన్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించింది.

ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 500 మంది..

నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి కోసం మలేషియా వెళ్లిన వారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి దాదాపు 500 మంది వరకు ఉండవచ్చని ఎన్ఆర్ఐ రాష్ట్ర కమిటీ అడ్వైజరీ మెంబర్ స్వదేశ్ పరికి పండ్ల పేర్కొంటున్నారు. ఉపాధి కోసం పొట్టచేత పట్టుకుని వెళ్లిన వారంతా తాజా నిబంధనలతో స్వస్థలాలకు తిరిగి రావాల్సి ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి కూడా వేలాది మంది మలేషియాలో ఉపాధి పొందుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గల్ఫ్ దేశాలైన దుబాయ్, మస్కట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా దేశాలతో పాటు మలేషియా కూడా వెళ్తున్నారు. ఈ క్రమంలో మలేషియాలో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 2,500 మంది వరకు ఉండగా తాజా నిబంధనలతో అందులో 500 మంది స్వదేశాలకు తిరిగి రావాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దీనికి గడువు 2026, ఏప్రిల్ 30 వరకు నిర్దేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని వలస కార్మికుల కుటుంబాల్లో ఆందోళనలు నెలకొంటున్నాయి.

నేడు ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్



బాసర ట్రిపుల్‌ఐటీ

- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్న అధికారులు
- ప్రభుత్వం నుంచి ప్రవేశాలకు గ్రీన్ సిగ్నల్

భైంసా: ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్‌కు సంబంధించి ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియపై ట్రిపుల్‌ఐటీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నోటిఫికేషన్ విడుదలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నోటిఫికేషన్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు వివరాలు, చివరి తేదీ, కౌన్సిలింగ్ వివరాలు పొందుపర్చనున్నారు. పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో సీట్ల కోసం దరఖాస్తు చేస్తుంటారు.

విద్యా విధానం...

ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో తొలి రెండేళ్లు ఇంటర్ సమానమైన పీయూసీ కోర్సు, నాలుగేళ్లు బీటెక్ కోర్సు ఉంటుంది. పీయూసీలో విద్యార్థుల విద్యా విధానం బట్టి బీటెక్‌లో అవకాశాలు వస్తాయి. సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీసీ, ఎంఎంఈ కోర్సులను ట్రిపుల్‌ఐటీ అందిస్తోంది.

రాష్ట్ర వ్యాప్తంగా పోటీ...

బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏటా వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఈ క్యాంపస్‌లో చదివిన విద్యార్థులు భారీ సంఖ్యలో ఉద్యోగాలు సాధిస్తున్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ప్రత్యేక ప్యాకేజీలతో కంపెనీలకు ఎంపికవుతున్నారు. దీంతో పిల్లలను ట్రిపుల్‌ఐటీలో చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకే ఇక్కడ చదువుకునే అవకాశం దక్కుతుంది.

నేడు నోటిఫికేషన్ విడుదల

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నాం. ప్రవేశాల కోసం విద్యార్థుల అర్హత, చివరి తేదీతో పాటు పలు వివరాలను నోటిఫికేషన్‌లో వెల్లడించనున్నాం. పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

– ప్రొఫెసర్ గోవర్ధన్, ట్రిపుల్‌ఐటీ వీసీ

తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు



కిషోర్

ఆదిలాబాద్: తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే ప్రయాణికుల కోసం జూన్ 14 నుంచి జూలై 13 వరకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాశీ, అయోధ్య, నైమిశారణ్యం, ప్రయాగ్ రాజ్, శృంగ్వార్‌పూర్ ప్రాంతాలు సందర్శించాలనుకునే వారికి గంగా రామాయణ పుణ్యక్షేత్ర ప్యాకేజీ అందుబాటులో ఉందన్నారు. ఉజ్జయిని, త్రయంబకేశ్వర్, మహాకాళేశ్వర్ వంటి ఐదు జ్యోతిర్లింగాలను దర్శించాలనుకునే ప్రయాణికులకు మరో ప్యాకేజీ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లలో ఎన్నో సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి కలవారు www. irctctourism.com వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9281030712, 9701360701, 9281495845, 9281030749, 9281030750 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

'నకిలీ ఇన్సూరెన్స్ కంపెనీలతో అప్రమత్తంగా ఉండాలి'

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ ఇన్సూరెన్స్ కంపెనీలతో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో యూనిక్ మరకన్‌టైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీ బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం డీఎస్పీ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన బాకే సరిత, దస్నాపూర్‌కు చెందిన అరక అశోక్ సదరు కంపెనీకి దాదాపు రూ.5లక్షల వరకు ఇన్సురెన్స్ చెల్లించారన్నారు. ఇన్సూరెన్స్ పూర్తయినా సదరు ఏజెంట్లు డబ్బులు ఇవ్వకుండా వారికి సమాధానం చెప్పడం లేదన్నారు. దీంతో సంజయ్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సేవసింగ్, అతని భార్యపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఇన్సూరెన్స్ రెగ్యులారిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా ఆమోదించబడిన వాటిలో మాత్రమే ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: అనుమానంతో భార్యను మానసికంగా వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి వెంకటమ్మ తెలిపారు. బేల మండలంలోని సిర్సన్న గ్రామానికి చెందిన దండెపల్లి నర్సయ్యకు దేవతతో 2003లో వివాహమైంది. 2013లో కుమారుడు జన్మించగా తనకు పుట్టలేదని భార్యను వేధించేవాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి ఇబ్బందులకు గురిచేసేవాడు. దీంతో అతని భార్య 2019 అక్టోబర్ 18న ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి దేవన్న ఫిర్యాదు మేరకు బేల పోలీసు స్టేషన్‌లో అప్పటి ఎస్సై కేసు నమోదు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ షాహిన్ సుల్తానా నేరం రుజువు చేశారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య



నారాయణ (ఫైల్)

తాంసి: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కప్పర్లకు చెందిన అనుప నారాయణ (32) వ్యవసాయకూలీగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం మద్యం సేవించి పంటచేనుకు వెళ్లాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని చేను యజమానికి సమాచారం ఇచ్చాడు. యజమాని చేను వద్దకు వెళ్లేసరికి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అంబులెన్సులో రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై రాధిక తెలిపారు.

వివాహం కావడంలేదని యువకుడు..



సుదర్శన్ (ఫైల్)

సోన్: వివాహం కావడంలేదని మనస్తాపంతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన గోలి సుదర్శన్ (31) ఆరునెలల క్రితం విదేశాల నుంచి తిరిగి వచ్చాడు. తనకు వివాహం కావడంలేదని మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కె.గోపి తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన జావిద్ ఖాన్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన అబ్దుల్ అజీజ్ ఇద్దరు కుమారులకు కాంట్రాక్ట్ పద్ధతిలో తహసీల్దార్ కార్యాలయంలో, సిటీ యూనియన్ బ్యాంక్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. వారి వద్ద నుంచి రూ.2లక్షల చొప్పున రూ.4లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదు. డబ్బులు అడిగితే చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన దార్ల అశోక్ ద్విచక్ర వాహనం మంగళవారం చోరీకి గురైంది. తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనం కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

సమయానికి రారు.. పట్టించుకోరు!



హాజీపూర్ పీహెచ్‌సీ లోపల ఖాళీగా దర్శనమిస్తున్న వైనం



పీహెచ్‌సీ ఎదుట ఎదురు చూస్తున్న రోగులు

హాజీపూర్ పీహెచ్‌సీ సిబ్బంది సమయానికి రాకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. వైద్యుల కోసం గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఉదయం సమయానికే తాళాలు తీసినా.. సిబ్బంది మాత్రం సమయం దాటాకే వస్తున్నారని, సాయంత్రం కూడా సమయం కాకముందే తాళం వేసి ఎంచక్కా వెళ్లిపోతున్నారని ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– మంచిర్యాలరూరల్(హాజీపూర్)

నలభీములకు c/o కుభీర్

- మండల కేంద్రంలో 20 బృందాలు
- ఏడాది పొడవునా చేతినిండా పని
- జిల్లాతో పాటు మహారాష్ట్రలోనూ వంటల తయారీ



వంట చేస్తున్న వంటాచార్యుడు

కుభీర్: నిర్మల్ జిల్లాలోని కుభీర్ నలభీములకు (వంట మనుషులకు) ప్రసిద్ధి గాంచింది. మండల కేంద్రంలో సుమారు 20 బృందాలు ఉన్నాయి. ఒక్కో బృందంలో ఒక మాస్టారు, ఇద్దరు లేదా ముగ్గురు సహాయకులు ఉంటారు. అంతేకాకుండా కూరగాయలు కోయడానికి, చపాతీ, పూరీ, లడ్డూ, బాదుషా తయారు చేయడానికి మహిళలను కూలీకి మాట్లాడుకుని వెంట తీసుకెళ్తారు. జిల్లాలోని వివిధ గ్రామాలతో పాటు మహారాష్ట్రలోని పలు గ్రామాలకు వంటలు చేయడానికి వెళ్తారు. ఒక్కో శుభ కార్యానికి మనుషుల లెక్కన రూ.8 వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకుంటారు.

ఏడాది పొడవునా పని..

కుభీర్‌కు చెందిన సుమారు 100 మంది మహిళలు, పురుషులకు ఈ రంగంలో ఏడాది పొడవునా ఉపాధి లభిస్తోంది. వెజ్, నాన్‌వెజ్‌తో పాటు లడ్డూ, బాదుషా, జిలేబీ, కాకినాడ కాజా, చపాతీ, పూరీ, మజ్జిగ, కార, బూంది, పాపడాలు, అన్నం, పప్పు, కూరగాయలు.. ఇలా అన్నిరకాల వంటలు చేస్తారు. నాన్‌వెజ్‌లో చికెన్ బిర్యానీ, మటన్ బిర్యానీ, చేపల ఫ్రై, బోటి.. ఇలా అన్నిరకాల వంటలు చేస్తారు. ఇంట్లో శుభకార్యం ఉన్నవారు రెండు నెలల ముందుగానే ఆర్డర్ ఇచ్చి బుక్ చేసుకుంటారు. వారి వద్ద వంటకు సంబంధించిన కొన్ని పాత్రలు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తే మరిన్ని పాత్రలు కొనుగోలు చేసుకోవడంతో పాటు మరికొంత మందికి ఉపాధి లభిస్తుందని వారు పేర్కొంటున్నారు.

ప్రధాన వంటాచార్యులు వీరే

కుభీర్‌కు చెందిన ప్రధాన వంటాచార్యులు ఆరె లక్ష్మణ్, కందూర్ పోతన్న, పెద్ద పోతన్న, బత్తిని సాయన్న, మధు, కిని సంతోష్, బ్రాహ్మణ్ శేఖర్, బ్రాహ్మణ్ శేషు, జరి ముత్యం, సిద్దూర్ పోతన్న, పోతాజీ, సాకలి రాందాస్, కొబ్బాజి పోతన్న, బంక బాబు, బ్రాహ్మణ్ రాజు, చవాన్ విశ్వనాథ్, అడెల్లు, సాయినాథ్, గంగాధర్ ఉన్నారు.

చేతినిండా పని



మాకు ఏడాది పొడవునా చేతినిండా పని ఉంటుంది. ఎండాకాలంలో పెళ్లిళ్లు ఎక్కువగా ఉంటాయి. వర్షాకాలం, చలికాలంలోనూ చిన్నచిన్న శుభకార్యాలు ఉంటాయి. నావద్ద ముగ్గురు అనుచరులు ఉన్నారు. అవసరమైనప్పుడు మహిళా కూలీలను కూడా తీసుకుంటాను.

– బ్రాహ్మణ్ శేఖర్, వంటాచార్యుడు, కుభీర్

ప్రభుత్వం ప్రోత్సహించాలి



నేను 20 ఏళ్లుగా వంటలు చేస్తున్నా. ప్రభుత్వం ప్రోత్సాహం అందించి ఆర్థికసాయం అందిస్తే మరిన్ని వంటపాత్రలు కొనుగోలు చేసి మరికొందరికి ఉపాధి కల్పిస్తా.

– ఆరె లక్ష్మణ్, వంటాచార్యుడు, కుభీర్

బాసర ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సేవా సమితి సిబ్బంది

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి 60 రోజుల హుండీ ఆదాయాన్ని మంగళవారం అక్షరాభ్యాస మండపంలో లెక్కించారు. రూ.77,77,746 నగదు, 126 గ్రాముల మిశ్రమ బంగారం, మూడు కిలోల 440 గ్రాముల మిశ్రమ వెండి, 17 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

బాక్సింగ్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ్‌గౌడ్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఆరుమల్ల రాజు, ప్రధాన కార్యదర్శి కే.దేవేందర్‌ను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రయాణికురాలి బ్యాగ్ నుంచి నగదు అపహరణ



బస్సు వద్ద నిరీక్షిస్తున్న ప్రయాణికులు

రెబ్బెన: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళా ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి నగదు అపహరించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు చింతలమానెపల్లి చెందిన మహిళ మంగళవారం రెబ్బెన మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వరకు వచ్చింది. అక్కడి నుండి మంచిర్యాల వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. అయితే కండక్టర్‌కు చూపించేందుకు తన హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న ఆధార్‌కార్డును తీసేందుకు బ్యాగు తెరవగా అందులో ఉన్న రూ.15వేలు కనిపించలేదు. దీంతో బస్సును దేవుల గూడ వద్ద ఆపి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది బస్సులో ఉన్న ప్రయాణికులందరి బ్యాగులను తనిఖీ చేసినా డబ్బులు లభించలేదు. అయితే రెబ్బెన బస్‌స్టాప్‌లో కొంతమంది ప్రయాణికులు బస్సు దిగిపోయారని, వారిలోనే డబ్బులను చోరీ చేసిన ఉండి ఉంటారని పోలీసులు భావించారు. ఘటనతో మంచిర్యాలకు వెళ్లే ప్రయాణికులు సుమారు 1:15 గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. ఈ విషయమై ఎస్సై చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఘటనపై బాధితురాలు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 18న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ –25 జిల్లా ఎంపిక పోటీలు నిర్వహించారు. 200ల మంది క్రీడాకారులు పాల్గొనగా 90 మందిని ఎంపిక చేసి ఆరు టీంలుగా విభజించారు. ప్రతీ టీంను మిగిలిన అన్ని టీంలతో రెండు రోజుల పాటు ఆడించాలని భావించగా వర్షంతో వాయిదా పడింది. మంగళవారం జిల్లాలోని మూడు మైదానాల్లో ఎంపిక పోటీలు నిర్వహించినట్లు హెచ్‌సీఎల్ సెక్రటరీ కోదాటి ప్రదీప్, కోచ్ పి.ప్రదీప్ తెలిపారు. మంచిర్యాలలోని ఉషోదయ పాఠశాల, గుడిపేట 13వ పోలీసు బెటాలియన్ మైదానం, మందమర్రిలోని సింగరేణి మైదానంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆరు టీంలలో ప్రతిభ కనబర్చిన వారిని ఒక టీంగా చేసి, వారిని ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.

తుర్కం చెరువును సందర్శించిన ట్రైనీ అటవీ అధికారులు



తుర్కం చెరువు వద్ద ట్రైనీ ఫారెస్ట్ బీట్ అధికారులు

మామడ: మండలంలోని ఎకో టూరిజం సందర్శన కేంద్రం అయిన తుర్కం చెరువును ట్రైనీ అటవీ అధికారులు శిక్షణలో భాగంగా మంగళవారం సందర్శించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన 42 మంది ట్రైనీ బీట్ అధికారులు తుర్కం చెరువుతోపాటు యెంగన్న చెరువు వద్ద వలస పక్షులను ప్రత్యేక కెమెరాలతో వీక్షించారు. చెరువులకు వస్తున్న పక్షుల రకాల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అడవిలో పెరుగుతున్న మొక్కల రకాలను తెలుసుకున్నారు. వారివెంట ఎఫ్ఆర్వోలు శ్రీనివాస్‌రావు, స్వరూప, ఎఫ్ఎస్వో శ్రీనివాస్, పీడీ కొండల్‌రావు ఉన్నారు.